'బసవేశ్వరుడి ఆశీర్వాదంతో గెలుస్తా'



జ్యోతి ప్రజ్వలన చేసిన హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత, పీఠాధిపతి గంగామాతాజీ

జియాగూడ: బసవేశ్వరుడి ఆశీర్వాదంతో హైదరాబాద్ పార్లమెంట్‌ను గెలిచి తీరుతానని బీజేపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. ఆదివారం రాత్రి జియాగూడలోని బసవ మండప్‌లో తెలంగాణ రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు శంకరప్ప పాటిల్, ఉపాధ్యక్షులు జగన్నాథప్ప, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ పట్నే, ప్రభాకర్ సతాడే, విజయకుమార్ పట్నేల ఆధ్వర్యంలో జగద్గురు గంగామాతాజీకి సన్మానం, మహిళా దినోత్సవం పురస్కరించుకుని జ్యోతి ప్రజ్వలన చేసి మాతే మహాదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు, బసవ జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం మాధవీలత మాట్లాడుతూ.. బసవ ధర్మరక్షణ పీఠంలో మహిళలను సమానంగా గౌరవించే గొప్ప సంస్కృతి కలిగి ఉండడం ఎంతో అభినందనీయమన్నారు. జియాగూడ బసవ మండపానికి మొదటిసారి వచ్చినప్పుడు బసవేశ్వరుడిని దర్శించి పీఠాధిపతి గంగామాతాజీ ఆశీర్వాదం పొందానన్నారు. రెండో సారి హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా టికెట్ లభించడంతో వచ్చానన్నారు. 3వ సారి తప్పకుండా హైదరాబాద్ పార్లమెంటును గెలిచి విజయంతో వస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ జియాగూడ బసవ మండప్ అధ్యక్షుడు భాగ్యవాన్ జావాలే, ఉపాధ్యక్షులు కె.శివాజీ, ప్రధాన కార్యదర్శి కె.మారుతి, గౌరవ అధ్యక్షులు నాగరాజ్ కాల్సే, సహ కార్యదర్శి జయరాజ్, కోశాధికారి జగన్నాథ్ జవాలే, వైద్యనాథ్, భీమ్‌రావు బిరాదర్, కర్ణాటక బ్యాంకు మేనేజర్ జె.రవిచంద్ర, టీటీడీపీ అధ్యక్షులు కె.నర్సింగ్‌రావు, మాణిక్‌రెడ్డి, కె.సంగమేష్, అసిస్టెంట్ మేనేజర్ అయ్యప్పరాజు విహార్ పాల్గొన్నారు.

'పది' పరీక్షలు షురూ..





పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు

విజయనగర్‌కాలనీ/గోల్కొండ: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ఇంతకు ముందే పరీక్షా కేంద్రాలను చూసి రావడంతో ఎలాంటి ఆలస్యం లేకుండా విద్యార్థులను సమయానికి తీసుకువచ్చారు. గోల్కొండ జోన్ ఆసిఫ్‌నగర్ మండల పరిధిలో మొత్తం 12244 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 12168 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 76 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు డిప్యూటీ డీఈఓ బానోతు వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తం 56 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని 680 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. నలుగురు రూట్ అధికారులు, ఏడుగురు కస్టోడియన్‌లు, ఏడుగురు జాయింట్ కస్టోడియన్‌లు విధులు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే పరీక్షలు రాస్తున్న తమ పిల్లలను వెంట తీసుకొని వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.

సంతోష్‌నగర్‌లో..

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఇందుకు సంబంధిత అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు సమయం కంటే ముందుగా చేరుకున్నారు. ఈ పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటలకు మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్ష కేంద్రాల్లో వెళ్లే విద్యార్థులకు కేంద్రం వద్ద నిర్వాహకులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి లోనికి అనుమతించారు. ఇండో ఇంగ్లీష్ హై స్కూల్, వికాస్ హై స్కూల్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



కూతురికి ఆల్ ది బెస్ట్ చెబుతున్న తండ్రి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



డాక్టర్ శ్రీనివాసులును సత్కరించిన శివకుమార్, చంద్రశేఖర్ తదితరులు

అబిడ్స్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన ఆయనను టీఎన్జీవోస్ ఎంఎన్‌జే యూనిట్ సభ్యులు బి.శివకుమార్, కె.చంద్రశేఖర్, రాజేష్, శివ, అమీదుల్లా, జగన్, ఉదయ్, సాయి, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ..ఆంకాలజీ విభాగంలో ఆధునాతన వైద్యసేవలందించేందుకు ఎంఎన్‌జే ఆసుపత్రి ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా ఏఓలుగా నియమితులైన అరుణజ్యోతి, సుధాకర్‌లను కూడా టీఎన్జీవోస్ యూనిట్ సభ్యులు సన్మానించారు.

నీటి ఎద్దడి నివారణకు కృషి చేయండి



జాంబాగ్‌లో సమస్యలు తెలుసుకున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: జాంబాగ్ పరిధిలోని ఇడ్లీ గల్లీ, సిక్ గల్లీలలో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పర్యటించి ఆయా ప్రాంతాల్లో నీటి ఎద్దడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..ఇడ్లీ గల్లీ, సిక్ గల్లీలలో వెంటనే పవర్ బోర్‌వెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలు ఉన్నా, లేకున్నా ప్రతిరోజూ ప్రజల మధ్య పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నీటి ఎద్దడి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు మేనేజర్ శేఖర్‌తోపాటు ఇతర అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్‌గౌడ్, భాస్కర్, నర్సింగ్, సతీష్, నరేష్, గణేష్ పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఆయనను కలవడానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే దానిపై స్పందించి తాను పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి కార్వాన్‌లో తన దృష్టికి రాలేదన్నారు. వేసవి రాకముందే జలమండలి అధికారులతో పలుమార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించి నీటి సరఫరాలో ఎటువంటి అవాంతరాలు, కోతలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

21న ఎస్పీ.భారతికి కీర్తి పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ: కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ ఎస్పీ.భారతికి ఈ నెల 21న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కారం ప్రదానం చేయనుంది. ఈ పురస్కారానికి తనను ఎంపిక చేయడంపై సోమవారం ఆమె ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో 42 సంవత్సరాలుగా కూచిపూడి నాట్య రంగంలో విశేష కృషి చేస్తున్నందుకు గాను ఈ కీర్తి పురస్కారానికి ఎంపిక చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

ఉద్యోగాల ప్రక్రియలో దళారులను నమ్మొద్దు



బానోతు నెహ్రూ నాయక్

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం ఎలాంటి పైరవీలకు అభ్యర్థులు పోవొద్దని, మెరిట్ ప్రకారమే ఈ ఉద్యోగ ప్రక్రియ ప్రభుత్వం చేపడుతుందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెహ్రూ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా కొందరు మెరిట్ ఉన్నవారికి ఫోన్లు చేసి వారికి ఉద్యోగాలు ఇప్పిస్తామని పెద్ద ఎత్తున డబ్బులు డిమాండ్ చేస్తున్నామని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎవరూ దళారులు మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ వచ్చినందునా ఈ భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపి వేయడం జరిగిందన్నారు. ఈ రిక్రూట్‌మెంట్ పూర్తి పారదర్శకంగా, మెరిట్ ఆధారంగా జరుగుతుందని అభ్యర్థులు గమనించాలని కోరారు.

సత్కారం



చార్మినార్: శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆశీస్సులు భక్తులందరికీ ఉంటాయని శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చిన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి అన్నారు. బసవేశ్వర కాలనీలో కొత్తగా నిర్మించిన ఆలయంలో మరకత లింగం ప్రతి స్థాపన సందర్భంగా ఆయన శ్రీశైలం నుంచి నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగనాథ్ మాశెట్టి ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులందరూ ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కలిగి ఉంటారన్నారు.

'రంజాన్ మాసం పవిత్రమైంది'



చార్మినార్: రంజాన్ మాసం పవిత్రమైందని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. మజ్లిస్ పార్టీ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ఖిల్వత్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు ముంతాజ్ అహ్మద్ ఖాన్, అహ్మద్ పాషా ఖాద్రి పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

జియాగూడ: పురానాపూల్ వద్ద గల ఓ వైన్స్‌లో మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తులు గొడవ పడగా ఓ వ్యక్తి మరో వ్యక్తిపై బీరు బాటిల్‌తో దాడిచేసి గాయపరిచిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామస్వామి వివరాల ప్రకారం..జియాగూడ కేశవ స్వామినగర్‌కు చెందిన రౌడీషీటర్ మల్లికార్జున్ (27) ఆటోడ్రైవర్. మంగళ్‌హాట్ రహీంపురాకు చెందిన వికాస్ జాదవ్ (23) వృత్తిరీత్యా ప్రైవేటు ఉద్యోగి, ఇతని స్నేహితుడు ఆకాష్ పురానాపూల్ భవాని వైన్స్‌లో మద్యం తీసుకుని ఉండగా వికాస్ జాదవ్ వైన్స్‌కు వెళ్లాడు. ఇదిలా ఉండగా అక్కడే ఉన్న రౌడీషీటర్ మల్లికార్జున్ వికాస్ జాదవ్‌తో గొడవ పడ్డాడు. అనంతరం వైన్స్ బయటకు వచ్చిన ఇద్దరు పురానాపూల్ వద్ద మల్లికార్జున్ వికాస్ జాదవ్‌పై బీరు బాటిల్‌పై దాడిచేశాడు. దీంతో తీవ్ర గాయాలైన వికాస్ జాదవ్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా పోలీసులు సోమవారం మల్లికార్జును పట్టుకుని కోర్టు రిమాండ్‌కు తరలించారు.

దేశాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి



కేవీపీ రాంచంద్రరావును సత్కరిస్తున్న ప్రకాష్‌రెడ్డి, గోల్కొండ సతీష్

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ ఎస్.ప్రకాష్‌రెడ్డి, తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీష్ పేర్కొన్నారు. సోమవారం తెలుగు రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు కేవీపీ రాంచంద్రరావును కలిసి పలు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశానికి కాంగ్రెస్ పాలన ఎంతో అవసరమని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే దేశ ప్రగతి కొనసాగుతుందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీలను ఇతర సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. గత పదేళ్లుగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు నరకం చూశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముఖేష్, రవీందర్, ఉద్యోగ సంఘం నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.

నిజమైన కాంగ్రెస్ వాదికే మేరు సంఘం కార్పొరేషన్‌ను ఇవ్వండి



భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: నిజమైన కాంగ్రెస్ వాదికే మేరు సంఘం కార్పొరేషన్ చైర్మన్ కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పలువురు మేరు కుల సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పనిచేసిన మేరు కులస్తులకు మేరు కులస్తుల కార్పొరేషన్ చైర్మన్‌ను ఇవ్వొద్దని సూచించారు. 30 ఏళ్లకు పైగా తాను కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేసిన తనకు కార్పొరేషన్ చైర్మన్‌ను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మేరు సంఘం నాయకులు పాల్గొన్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



వీర్ల ఐలయ్యను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ వీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం బీసీ సాధికారత భవన్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రెంక రవి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్ల ఐలయ్యను యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. అద్దె బస్సు డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె బస్సులు నడిపే డ్రైవర్లకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. 15 ఏళ్లుగా ఆర్టీసీలో డ్రైవర్లుగా పనిచేస్తున్నారని వారికి బస్‌పాస్ సౌకర్యం కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం..సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది డ్రైవర్లను ప్రభుత్వం నియమించే ఆర్టీసీ నియమకాలలో డ్రైవర్లకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వంగాల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి 'కొమురయ్య' తెలియాలి



మాట్లాడుతున్న దొడ్డి చంద్రం తదితరులు

సుల్తాన్‌బజార్: దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను నేటి తరాలకు అందించేందుకు దొడ్డి కొమురయ్య సినిమాను నిర్మిస్తున్నామని ఆ సినిమా డైరెక్టర్ ఎం.సేనాపతి తెలిపారు. హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ 33 జిల్లాల కమిటీల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఎం.సేనాపతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య మనుమడు దొడ్డి చంద్రం హాజరై మాట్లాడారు. దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణం కోసం దర్శకుడు సేనాపతి తెలంగాణలో ఉన్న 33 జిల్లాలను తిరుగుతూ ప్రతి జిల్లాలో సినిమా గురించి వివరిస్తూ అందరిని భాగస్వాములను చేయడం గొప్ప ప్రయత్నమన్నారు. ఈ కార్యక్రమంలో కంది సూర్యనారాయణ, భూమన్న, సుబ్బయ్య, భిక్షపతి గౌడ్, రావుల సురేష్, మురళీకృష్ణ, భగవాన్‌దాస్, ఆంజనేయులు, పోతిరెడ్డి రమణ, హన్మంతు, జె.శ్రవణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం



ఎమ్మెల్యే దానంను సత్కరిస్తున్న వాసు ముదిరాజ్, సుభాష్ లడ్డా తదితరులు

అబిడ్స్: కాంగెస్ ప్రభుత్వంతోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాసు ముదిరాజ్, సుభాష్ లడ్డా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం దేశంలోని అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉంటుందన్నారు. 100 రోజుల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజల మనసును గెలుచుకుందన్నారు. తన మాతృపార్టీ అయిన కాంగ్రెస్ పార్టీలోకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

శాస్త్రీయ కళలు మన సంపద



చిన్నారులతో ఎస్.వేణుగోపాల చారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ జానపద కళలు మన దేశ వారసత్వ సంపద అని కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాల చారి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో శృజన ఆర్ట్ థియేటర్స్ 34వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్నారులకు పాఠశాల స్థాయి నుంచే కళల పట్ల మక్కువ కల్పించాలని ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. అనంతరం కళాకారులను సన్మానించారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, నృత్య గురువులు ఝాన్సీరామ్, హరిణి, స్వరాజ్యలక్ష్మి, రాధికా శ్రీనివాస్, సంస్థ అధ్యక్షులు పురుషోత్తమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య గురువు నిహంత్రిరెడ్డి శిష్యురాలు మహతి సూరి కూచిపూడి నాట్య రంగప్రవేశం సోమవారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. నృత్య సంస్థ అక్షానంద డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అలౌఖ్య, భామ కలాపం, అఖిలాండేశ్వరి, థిల్లాన వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రణాళిక, పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ గిరిజ శంకర్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ అరుణాభిక్షు, గాంధీ మెడికల్ కాలేజ్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, జీవి.అన్నారావులతో పాటు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అలరించిన నాట్య నీరాజనం



కళాకారులను సత్కరిస్తున్న వేణుగోపాలాచారి

నాంపల్లి: శారీరక, మానసిక ఎదుగుదలకు నాట్యం ఎంతో ఉపకరిస్తుందని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగిన దేవ దేవుడికి సంగీత, నాట్య నీరాజనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నాట్య కళాకారులను అభినందించారు. యువ కళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కథక్ నాట్యాచార్యులు పండిట్ అంజుబాబు, టి.వి. ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షులు మహ్మద్ షరీఫ్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాట్యాచార్యులు కనకదుర్గ, విశిష్టరావులను ఘనంగా సత్కరించారు. డాక్టర్ పేరిందేవి శిష్య బృందం ప్రదర్శించిన నాట్యాంశాలు ఆహుతులను అలరింపజేశాయి. జంటనగరాలకు చెందిన 40 మంది కళాకారులు, నాట్య నీరాజనంలో పాల్గొన్నారు. సంస్థ స్థాపక కార్యదర్శి జి.కృష్ణ, వ్యాఖ్యాత ఎం.వి.సుబ్రహ్మణ్యం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బీజేపీలో వాల్మీకి సమాజ్‌కు గౌరవ స్థానం కల్పించాలి



ఢిల్లీలో సమావేశానికి హాజరైన వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు

జియాగూడ: బీజేపీలో వాల్మీకి సమాజ్‌కు గౌరవ స్థానం కల్పించాలని వాల్మీకి సమాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి సతీస్‌బిడ్లా డిమాండ్ చేశారు. సోమవారం న్యూ ఢిల్లీలోని వాల్మీకి సమాజ్ కార్యాలయంలో దేశంలోని 18 రాష్ట్రాలకు చెందిన వాల్మీకి సమాజ్ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సతీష్‌బిడ్లా మాట్లాడుతూ..25 ఏళ్ల నుంచి వివిధ రాష్ట్రాల్లో వాల్మీకి సమాజ్ ప్రతినిధులు పార్టీకి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా 18 రాష్ట్రాలకు చెందిన వాల్మీకి సమాజ్ ప్రతినిధులు ముక్తకంఠంతో బీజేపీలో గౌరవ ప్రధమైన ప్రాధాన్యత కల్పిస్తూ ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్నారు. కోల్‌కత్తా నుంచి సురేష్‌రామ్ చౌహాన్, హరియాణా నుంచి రఘుమల్ భట్, కురుక్షేత్రం నుంచి రేఖరాణి, గుజరాత్ నుంచి మహేష్ వాగ్గేల, మహారాష్ట్ర నుంచి బంటి చావారియా, అస్సాం నుంచి జైకరణ్ వాల్మీకి, న్యూ ఢిల్లీ నుంచి వీర్‌పాల్ గలోట్, మీరట్ నుంచి లక్ష్మీరాఘుప్, మధ్యప్రదేశ్ నుంచి అశోక్‌పటేల్, జమ్మూకశ్మీర్ నుంచి విజయానంద్, వెస్ట్‌బెంగాల్ నుంచి హరిఓం హవాడ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



గోల్కొండ: సమాజ సేవ చేస్తేనే మహిళలను సమాజం గుర్తిస్తుందని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ షేక్‌పేట్ మండల ప్రతినిధి ఆయిషా సిద్దిఖా అన్నారు. సోమవారం షేక్‌పేట్ డివిజన్ టోలిచౌకి ఆదిత్యనగర్‌కాలనీలో టాలెంట్ పార్కు స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా షేక్‌పేట్ మండలంలోని పలువురు మహిళలకు ఉత్తమ సేవా అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షేక్‌పేట్ మండలంలోని వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ సమాజ సేవ చేసిన మహిళలకు అవార్డులు అందించి సత్కరిస్తున్నామన్నారు. ఆల్ ఇండియా ఐడియా టీచర్స్ అసోసియేషన్ తరపున ప్రతియేటా ఉత్తమ మహిళా అవార్డులు ఇస్తున్నామని అసోసియేషన్ షేక్‌పేట్ మండల అధ్యక్షుడు, వీనస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్‌అలీఖాన్ అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ సమీఉల్లా హుసేనీని సన్మానించారు. కార్యక్రమంలో భాషా, జమాలుద్దీన్ ఖాద్రీ, నజ్మా సుల్తానా, వసీం ఉన్నీసా, రఫియాబేగం తదితరులున్నారు.

ఆసుపత్రికి నీటి ట్యాంకర్లు పంపాలి



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి నీటి ట్యాంకర్లు పంపాలని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్‌ఉల్లా అన్నారు. సోమవారం ఆయన జలమండలి గోల్కొండ మేనేజర్ సాజిద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి కార్వాన్ నియోజకవర్గంలోనే అతిపెద్ద ఆసుపత్రి అని, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ వార్డులు ఉన్నాయని, ప్రతినిత్యం శస్త్ర చికిత్సలు జరుగుతాయని ఈ కారణంగా తమకు నీరు ఎంతో అవసరమని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతినిత్యం సుమారు వెయ్యి మంది ఔట్ పేషంట్లు, వంద పడకల సామర్థ్యం గల ఇన్‌పేషంట్ విభాగం, వంద శాతం ఆక్యూపెన్సీతో ఈ వార్డు ఉంటుందని ఈ కారణంగా తమకు ప్రతినిత్యం వందలాది లీటర్ల నీరు అవసరమని ఆయన అన్నారు. మరోవైపు ఆసుపత్రి ఆర్ఎంవో వినాయక్‌రావు, ఏవో శ్రీనివాస్ రావు కార్వాన్ ఎమ్మెల్యేను కలిసి తమకు నీటి ట్యాంకర్లు రావడం లేదని ఈ విషయంపై చొరవ చూపాలని కోరుతూ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి నీటి ట్యాంకర్లు సరఫరా అయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

23న ఫాల్కనర్ యూనివర్సిటీ స్పాట్ అడ్మిషన్లు



సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ వైవిధ్యాన్ని పెంపొందించడంలో భాగంగా భారతదేశ విద్యార్థులను చేర్చుకునే లక్ష్యంతో అలబామా-మాంట్‌గోమెరీలోని ఫాల్కనర్ యూనివర్సిటీ ఒక వ్యూహాత్మక కార్యక్రమాన్ని ప్రకటించింది. అంతర్జాతీయంగా విస్తరించడం కోసం ఫాల్కనర్ యూనివర్సిటీ నగరంలోని యూనివర్సిటీ హబ్‌తో ప్రత్యేక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఐటీ, వ్యాపార రంగాల్లో విద్యార్థుల చేరికను క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఫాల్కనర్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ మిచ్ హెన్రీ మాట్లాడుతూ..మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ మేనేజ్‌మెంట్ ఇన్ బిజినెస్ ఎనలిటిక్స్, మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ మేనేజ్‌మెంట్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి కోర్సులను అతి తక్కువ ట్యూషన్ ఫీజులతో అందిస్తున్నామని తెలిపారు. మొత్తం ఫీజు సుమారు 17,500 డాలర్లు మాత్రమేనని, ఈ వెసులుబాటు భారతీయ విద్యార్థులకు అధునాతన వ్యాపార విద్యను మరింత అందుబాటులోకి తీసుకొస్తుందని అన్నారు. ఈ నెల 23న నగరంలోని తాజ్ వివాంటా హోటల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఫాల్కనర్ యూనివర్సిటీకి ప్రత్యేక భాగస్వామిగా విద్యార్థులకు ఉచిత సేవలు అందించానికి కట్టుబడి ఉన్నామని, ఉన్నత ప్రమాణాలతో పరీక్షలకు సాయం చేయడం, యూనివర్సిటీ ఎంపిక, వీసా ఇంటర్వ్యూకు సిద్ధం కావడం, అమెరికా వెళ్లడానికి కావల్సిన శిక్షణలన్నీ అందిస్తామని యూనివర్సిటీ హబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ అనిల్ పల్లా వివరించారు.